# సాక్షి సూర్యాపేట

బుధవారం ◊ 9 ◊ ఆగస్టు ◊ 2023






**గంజాయి రవాణా ముఠా అరెస్ట్**

వైజాగ్ నుంచి ఢిల్లీకి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. - 8లో



**ఉజ్వల భవిష్యత్తుకు 'నవోదయం'**

చలకుర్తి జేఎన్‌వీలో 2024-25 సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ వచ్చింది. - 8లో



**స్పష్టమైన ప్రకటన చేయాలి**

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి కోరారు. - 10లో

# ఎన్నికలకు ఎంత మంది!

**అవసరమయ్యే సిబ్బంది కోసం లెక్కలు వేస్తున్న అధికారులు**

- ఉపాధ్యాయులతో పాటు ఉద్యోగుల వివరాల సేకరణ
- కలెక్టర్ ఆదేశాలతో అన్ని శాఖలకు ప్రత్యేక నమూనా పత్రం జారీ
- 10వ తేదీలోగా పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక



| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | పోలింగ్ సిబ్బంది |
|---|---|---|
| హుజూర్‌నగర్ | 302 | 1812 |
| కోదాడ | 286 | 1,716 |
| సూర్యాపేట | 264 | 1,584 |
| తుంగతుర్తి | 316 | 1,896 |
| మొత్తం | 1168 | 7,008 |

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :**రానున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఎంతమంది సిబ్బంది అవసరమవుతారనే అంశంపై జిల్లా యంత్రాంగం లెక్కలు వేస్తోంది. నాలుగు నియోజకవర్గాల్లో 1,168 పోలింగ్ కేంద్రాలకు 7,008 మంది సిబ్బంది అవసరమని అధికారులు అంచనా వేశారు. ఉద్యోగుల వివరాల సేకరణకు ప్రత్యేక నమూనా పత్రాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని శాఖలకు జారీ చేశారు. ఇందులో 45 అంశాల సమాచారం పొందుపర్చాలని ఆదేశించారు. ఈనెల 10 వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు.

**ప్రక్రియ వేగవంతం**

ఎన్నికల సంఘం డిసెంబర్‌లోపు రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు నిర్వహించడానికి కసరత్తు చేస్తోంది. దానికి అనుగుణంగా రెండు నెలల్లో షెడ్యూల్, ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే ఆయా నియోజక వర్గాల్లో ఎన్నికల విధుల నిర్వహణకు గాను అవసరమయ్యే సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో ఎంత మంది, ఉపాధ్యాయులు ఉద్యోగులు ఉన్నారు? పోలింగ్ కేంద్రాల వారీగా విధుల కేటాయింపు, స్థానికులు, స్థానికేతరులు, సొంత నియోజకవర్గం తదితర వివరాల సేకరణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటికే ఈ ప్రక్రియ దాదాపు సగం వరకు పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ నెల 10వ తేదీ లోగా దీనిని పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదించడానికి జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు.

**45 అంశాలపై సమాచారం**

జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాలను 45 అంశాలతో కూడిన ప్రత్యేక నమూనా పత్రంలో అప్ లోడ్ చేయాలని ఇప్పటికే అన్ని శాఖలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ మేరకు ఉద్యోగులంతా వ్యక్తిగతంగా అన్ని వివరాలను నమోదు చేసి అప్లోడ్ చేసే పనిలో ఉన్నారు. ఉద్యోగి సబ్ ట్రెజరీ కార్యాలయంలో జీతం తీసుకునే ఐడీ నంబర్ మొదలుకుని, అతని హోదా, ఏ శాఖ, ఏ నియోజక వర్గం పరిధిలో పనిచేస్తున్నారు, పోలింగ్ సమయంలో ఏ నియోజకవర్గంలో ఉంటారు. సొంత గ్రామం ఏ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ప్రస్తుత, శాశ్వత చిరునామాలు, ఈ మెయిల్, బంధుత్వం, దివ్యాంగులా? వంటి వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్నారు. గత ఎన్నికల్లో ఏ పోలింగ్ కేంద్రంలో ఏ హోదాలో విధులు నిర్వహించారు. ఉద్యోగి ఐడీ కార్డు, నేర చరిత్ర ఉందా? బ్యాంకు ఖాతా వివరాలు తదితర అన్ని అంశాలు ఈ ఫార్మాట్‌లో ఉన్నాయి. వాటి ప్రకారం ఉద్యోగులు అన్ని వివరాలను పొందుపరుస్తున్నారు. జిల్లా పరిధిలో గల నాలుగు నియోజకవర్గాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల వివరాలను సేకరిస్తున్నారు. గతంలో ఏ ఎన్నికల్లోనూ ఇన్ని వివరాలు సేకరించలేదని పలువురు ఉపాధ్యాయ, ఉద్యోగులు చెబుతున్నారు.

**వ్యక్తిగత వివరాల సేకరణ**

అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలంటే పోలింగ్ సిబ్బంది కీలకం కావడంతో వారి వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారు. ఇది కొనసాగుతుండగానే.. ఓటరు సవరణ, ముసాయిదా జాబితా ప్రకటన గడువును పెంచి, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. ఇప్పటికే ఎన్నికల సంఘం నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులను నియమించింది. దాంతో పాటే జిల్లా ఎన్నికల అధికారులుగా కలెక్టర్లు వ్యవహరించనున్నారు. మరో పక్క ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసింది. ఎన్నికల విధులను నిర్వర్తించేందుకు పీఓ, ఏపీఓ, ఓపీల ఎంపిక ప్రక్రియ కూడా వేగవంతమైంది.

## మంత్రి జగదీష్‌రెడ్డికి ఆర్టీసీ ఉద్యోగుల కృతజ్ఞతలు



మంత్రిని కలిసిన ఆర్టీసీ టీఎంయూ నాయకులు

**భానుపురి (సూర్యాపేట) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయడంలో కీలక భూమిక పోషించిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి సూర్యాపేట ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ మజ్దూర్ యూనియన్ హైదరాబాద్ జోన్ జాయింట్ సెక్రటరీ సుంకరి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు యావత్ ఆర్టీసీ ఉద్యోగులు రుణపడి ఉంటారన్నారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన మంత్రులు కేటీఆర్, జగదీష్ రెడ్డిలకు ఆర్టీసీ కార్మికులు అన్నివేళలా అండగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంయూ సీనియర్ నాయకులు బెజవాడ సీతారాములు, బెల్లి నరసయ్య, ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎస్.సి. సైదులు, నాయకులు చెరుకు వెంకటయ్య, యూసఫ్, ఎండి జానీ, వీరయ్య, శ్రీధర్, టి.బి. రావు, రేణుక, సిబ్బంది సైదులు, జానయ్య, శ్రీనివాస్ రెడ్డి, అంజి, నాగరాజు, ఉపేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## గణపవరం గ్రామాన్ని ప్రథమ స్థానంలో నిలపాలి

- డీఆర్‌డీఓ సుందరి కిరణ్‌కుమార్



గణపవరంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్

**మునగాల(కోదాడ):** స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా గ్రామాన్ని జాతీయస్థాయిలో ఎంపికకు పాలకవర్గం, స్థానిక అధికారులు కృషిచేసి ప్రథమ స్థానంలో నిలపాలని డీఆర్‌డీఓ సుందరి కిరణ్‌కుమార్ కోరారు. ఇటీవల స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 కార్యక్రమానికి రాష్ట్రస్థాయిలో ఎంపికైన మునగాల మండలంలోని గణపవరం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, గ్రామసర్పంచ్ కొండపల్లి విజయమ్మ, ఉపసర్పంచ్ కేతిరెడ్డి జితేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దేవిరెడ్డి వీరారెడ్డి, ఉపాధి ఏపీఓ శైలజ, టీఏ శేఖర్ , ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ , గ్రామ పెద్దలు కొండపల్లి నరసింహారావు, పోతుగంటి సోమేశ్వరరావు, మద్దూరి మల్లారెడ్డి పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### గోదావరి జలాలు విడుదల



బయ్యన్న వాగు వద్ద పూజలు చేస్తున్న ఎస్సారెస్పీ ఎస్‌ఈ శివ ధర్మ తేజ, అధికారులు

**తిరుమలగిరి (తుంగతుర్తి):** సూర్యాపేట జిల్లాకు గోదావరి జలాలను ఎస్సారెస్పీ ఎస్‌ఈ శివధర్మ తేజ, ఈఈ విజయ్‌కుమార్‌లు మంగళవారం జనగామ జిల్లా కొడకండ్లలోని బయ్యన్న వాగు నుంచి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాల్వ ద్వారా మొదటి రోజు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. వారబందీ విధానంలో నీటి విడుదల కొనసాగుతుందని చెప్పారు. రైతులు కాల్వలకు ఎలాంటి గండ్లు పెట్ట వద్దని కోరారు. వారి వెంట సీఈ సత్యనారాయణ, ఏఈ అమర్ ఉన్నారు.

### గృహలక్ష్మికి 12లోగా దరఖాస్తు చేసుకోవాలి

**దురాజ్‌పల్లి(సూర్యాపేట):** గృహలక్ష్మి పథకానికి ఈ నెల 12వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. సొంత స్థలం ఉండి, ఇళ్లు లేని నిరుపేదలు ఈ పథకానికి అర్హులని ఆయన పేర్కొన్నారు. రూరల్ ప్రాంతం వారు తహసీల్దార్ కార్యాలయంలో, అర్బన్ ప్రాంతం వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

### మెరుగైన విద్యాబోధన చేయాలి



అధ్యాపకులతో సమావేశమైన డీఐఈఓ

**ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) :** కళాశాల సిబ్బంది సులభరీతిలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని డీఐఈఓ జానపాటి కృష్ణయ్య సూచించారు. మంగళవారం ఆత్మకూర్ మండల పరిధిలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలకు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా అధ్యాపకులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఖాళీగా ఉన్న కెమెస్ట్రీ లెక్చరర్ పోస్టు మంజూరు చేయాలని కోరుతూ అధ్యాపకులు డీఐఈఓకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాకేంద్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### యాదాద్రిలో పురోహిత పోస్టులు భర్తీ

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో కేడర్ స్ట్రెంత్‌లో ఖాళీగా ఉన్న పురోహిత పోస్టులను మంగళవారం భర్తీ చేసినట్లు ఈఓ గీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు పోస్టులకు 30మంది దరఖాస్తు చేసుకోగా.. 27 మంది పరీక్షకు హాజరయ్యారని, ఇందులో ఎనిమిది మందికి అధిక మార్కులు వచ్చినట్లు వెల్లడించారు. 8 మంది అభ్యర్థులకు 1:2 చొప్పున పరీక్షలు నిర్వహించగా ఏ.నర్సింహాశర్మ, పి.సంతోష్ శర్మ, బి.సునిల్‌కుమార్‌శర్మ, టి.భార్గవాచార్యులు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

### మూసీకి తగ్గిన ఇన్‌ఫ్లో .. గేట్లు మూసివేత



వరద నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

**కేతేపల్లి:** ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో 20రోజులుగా తెరిచి ఉంచిన గేట్లను మూసివేశారు. మంగళవారం ఎగువ నుంచి మూసీకి 1,436 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 643.45 అడుగుల వద్ద ఉంది. మూసీ కుడి, ఎడమ కాల్వలకు 568 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.05 టీఎంసీల నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

## 13న పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

**భానుపురి (సూర్యాపేట) :** పద్మశాలీలకు రాజ్యాధికార సాధన కోసం ఈనెల 13న కోరుట్లలో రాజకీయ పార్టీలకు అతీతంగా పద్మశాలి రాజకీయ యుద్ధభేరి మహాసభ నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సభ వాల్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. పద్మశాలీలను ఓట్లువేసే యంత్రాలుగా ఉపయోగించుకుని, అధికారంలోకి రాగానే నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు 10 ఎమ్మెల్యే సీట్లు , 2 పార్లమెంటు, రెండు శాసనమండలి, ఒక రాజ్యసభ సీట్లను కేటాయిస్తున్నట్లు పద్మశాలీలకు డిక్లరేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. తమకు ప్రాధాన్యత ఇవ్వని రాజకీయ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చలమల్ల నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షులు పిషిక వీరయ్య, మాజీ కౌన్సిలర్ గండూరి రమేష్, మహిళా అధ్యక్షురాలు కసుకుంట్ల శారద దేవి, జిల్లా కార్యదర్శి దూలం నగేష్, ఎంపీటీసీ పొన్నం వెంకన్న, మిర్యాల గోపాలకృష్ణ, యలగందుల సుదర్శన్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు మిట్టకోల యుగంధర్, కస్తూరి కిషన్, పున్న వెంకన్న, బల్నే క్రాంతి కుమార్, యన్నం ఉమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'దీక్ష'తో చదివేలా..

- అర్థంకాని పాఠాలు మళ్లీ వినేలా అందుబాటులోకి కొత్త యాప్
- పాఠ్య పుస్తకాలపైనే క్యూఆర్ కోడ్ రూపకల్పన
- సెల్‌ఫోన్ ద్వారా స్కాన్ చేసి పాఠం చదువుకునే అవకాశం
- మధ్యమధ్యలో బడికిరాని పిల్లలకు ఉపయుక్తమంటున్న ఉపాధ్యాయులు




| | |
|---|---|
| మండలాల సంఖ్య | 23 |
| మొత్తం స్కూళ్లు | 1,282 |
| విద్యార్థులు | 1.31లక్షలు |

**చిలుకూరు:** ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇప్పటికే పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమాన్ని అమలు చేస్తోంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు రాయడం, చదవడం, లెక్కలు చేయడం వంటి అంశాలపై అర్థవంతంగా బోధించేందుకు ఉపాధ్యాయులకు తొలిమెట్టు కార్యక్రమం ద్వారా శిక్షణ ఇస్తున్నారు. దీనికితోడు అన్ని తరగతుల విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించిన పాఠాలు సరిగా అర్థం కాకున్నా మరోసారి వినేందుకు ప్రభుత్వం దీక్ష యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో పాఠశాలలకు వెళ్లని వారు సైతం పాఠాలను ఈ యాప్ ద్వారా వినవచ్చు. ఈ యాప్ రూపకల్పనలో భాగంగా అన్ని తరగతుల పాఠ్యపుస్తకాల మీద, ప్రతి పాఠం పక్కన క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. సెల్‌ఫోన్‌లో దీక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసి అందులోని క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే విద్యార్థులకు కావాల్సిన పాఠాలు అందుబాటులో ఉంటాయి.

**వీడియో రూపంలో పాఠం వినేలా..**

కరోనా సమయంలో పాఠశాలలను మూసి వేయడంతో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారు. ఆ సమయంలో ప్రభుత్వం దీక్ష యాప్‌ను ప్రవేశపెట్టింది. అందులో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని సబెక్టుల పుస్తకాలు, పాఠాలను తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో పొందుపరిచారు. విద్యార్థులకు అంతగా అర్థంకాని పాఠాలను పాఠ్యపుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే మొత్తం పుస్తకం వస్తుంది. లేదంటే కేవలం అర్థంకాని పాఠం మాత్రమే వినాలంటే ప్రతి పాఠం ప్రారంభంలో క్యూఆర్ కోడ్ ఉంటుంది. దానిని స్కాన్ చేయడం ద్వారా ఆ పాఠం వీడియో రూపంలో ప్రసారం అవుతుంది. దీక్ష యాప్‌లో ఉండగా ప్రస్తుతం అన్ని తరగతుల అన్ని సజెక్టుల పాఠాలన్నీ పొందుపరిచారు. ఈ యాప్ ద్వారా అన్ని తరగతుల విద్యార్థులకు అరచేతిలోనే సెల్‌ఫోన్ పెట్టుకొని ఆన్‌లైన్‌లో వీడియో పాఠాలు వినొచ్చు.

**కొత్త యాప్ ద్వారా పాఠం మళ్లీ వినొచ్చు**



ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీక్ష యాప్‌తో విద్యార్థులకు పాఠాలు అరచేతిలో ఉంటున్నాయి. విద్యార్థులు పాఠశాలలకు రాని సమయంలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలు అర్థంకాక ఇబ్బందులు పడేవారు. అలాగే పాఠాలు అర్థంకాని విద్యార్థులు దీక్ష యాప్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వీడియో రూపంలో వినొచ్చు.

– కొండా వెంకయ్య, రాంనగర్ పాఠశాల హెచ్‌ఎం, చిలుకూరు మండలం

## మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**మఠంపల్లి:** మఠంపల్లి మండలం మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, మూలవిరాట్‌స్వామికి పంచామృతాభిషేకం చేశారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం , పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ ,మాంగల్య ధారణ, తలంబ్రాలతో కల్యాణ తంతును ముగించారు.

## ఆశయాలకు అనుగుణంగా విలీన ప్రక్రియ ఉండాలి



ఆర్టీసీ అమరుల చిత్రపటాలతో ఉన్న ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు

**భానుపురి (సూర్యాపేట) :** అమరులైన ఆర్టీసీ అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా విలీన ప్రక్రియ ఉండాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ తీసుకొచ్చిన బిల్లుకు ఆమోదం తెలిపిన సందర్భంగా మంగళవారం సూర్యాపేట ఆర్టీసీ డిపో వద్ద అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఉండాలన్న ఉద్దేశంతోనే అప్పట్లో సమ్మె చేపట్టామని తెలిపారు. 2015, 2019 సమ్మెలో 35మంది ఆర్టీసీ కార్మికులు అమరులయ్యారని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు బత్తుల సుధాకర్, రవికుమార్, లచ్చయ్య, పీఎం రావు, సేవ్య, లక్ష్మయ్య, రాఘవులు, హనుమంతు, శ్రీకాంత్, రమేష్, నాగిరెడ్డి, పరశురాములు, కేవిరెడ్డి, ఇంద్రయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్కడి పనులు అక్కడే!

- బాలాజీ నగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో సౌకర్యాలు కరువు
- కరెంట్, నీళ్లు, రోడ్లు, డ్రెయినేజీ వసతులు నిల్
- ఐదేళ్ల క్రితం శంకుస్థాపన.. నిధులు లేవన్న సాకుతో కాలయాపన
- నేడు హడావుడిగా గృహప్రవేశాలు



డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో నిర్మాణదశలో ఉన్న సెప్టిక్ ట్యాంకులు

**కోదాడ:** ఐదేళ్ల క్రితం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టినా నేటికీ మౌలిక వసతులు కల్పించలేదు. నిధులు లేవన్న సాకుతో అధికారులు కాలయాపన చేస్తూ వస్తున్నారు. కరెంటు, నీళ్లు, డ్రెయినేజీ సౌకర్యాలు లేవు. బుధవారం హడావుడిగా గృహప్రవేశాల కార్యక్రమం చేపట్టనుండడంపట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కరెంట్ లేదు.. నీళ్లులేవు..**

కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో పేదల కోసం 560 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి 2018 మార్చి 7న శంకుస్థాపన చేశారు. మూడేళ్ల క్రితం పనులు అసంపూర్తిగా చేసి వదిలేశారు. రోడ్లు, డ్రెయినేజీ, మంచినీరు, కరెంట్ సౌకర్యం కల్పించనే లేదు. మూడు నెలల క్రితం లబ్ధిదారుల కోసం డ్రా నిర్వహించారు. అప్పటి నుంచి వీటి గృహ ప్రవేశం నిర్వహించడానికి ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నా.. అధికారులు మాత్ర కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఈలోగా లబ్ధిదారుల చేత గృహప్రవేశాలు నిర్వహించాలని చెప్పడంతో 15 రోజుల నుంచి అధికారులు పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో పిచ్చిమొక్కలను తొలగించి సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. మూడేళ్ల నుంచి వదిలేయడంతో ఇళ్ల కిటికీల అద్దాలను కొందరు ఆకతాయిలు పగులగొట్టారు.

**మరో రెండు నెలలు పట్టే అవకాశం**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లవద్ద ప్రస్తుతం అధికారులు సెప్టిక్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టారు. ఇళ్ల నుంచి దీనికి కనెక్షన్ ఇస్తున్నారు. ఇక మంచినీటి కోసం ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. అక్కడి నుంచి ఇళ్లకు కనెక్షన్ ఇవ్వడానికి పైప్‌లైన్ నిర్మాణం చేయాల్సి ఉంది. ఆ తరువాతే రోడ్లు నిర్మించాల్సి ఉంటుంది. ఇక విద్యుత్ సౌకర్యం లేదు. దీనికి అధికారులు ఇంకా ప్రతిపాదనలు పంపలేదు. బుధవారం గృహప్రవేశాల కార్యక్రమానికి హాజరయ్యే మంత్రికి ఈ ప్రతిపాదనలు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ పూర్తయ్యే సరికి రెండు మూడు నెలలు పట్టే అవకాశం ఉందని అధికారులే అంటున్నారు. బుధవారం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి ఒక ఇంటిని మాత్రమే శాస్త్రోక్తంగా గృహ ప్రవేశం చేయించనున్నట్లు వారంటున్నారు. పనులు పూర్తి అయిన తరువాతనే ఇళ్లలోకి అనుమతిస్తామని చెబుతున్నారు.

**అన్నిసౌకర్యాలు కల్పిస్తాం**

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. పనులను వేగంగా చేస్తున్నాం. విద్యుత్ ప్రతిపాదనలు సిద్ధం చేశాం. దీనికి నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. పగిలిన కిటికీ అద్దాలను తిరిగి ఏర్పాటు చేస్తాం.

– రాము, ఏఈ

**డబ్బులు ఇస్తేనే 'డబుల్' ఇళ్లు!**

- డ్రాలో ప్రత్యేకంగా తీయించానని బుకాయింపు
- ముందస్తుగా ప్రామిసరీ నోట్ రాయించుకున్నట్లు వెల్లడి
- కోదాడలో వైరల్‌గా మారిన అధికార పార్టీ కౌన్సిలర్ ఫోన్ సంభాషణ

కోదాడలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల డ్రా పారదర్శకంగా జరగలేదా? అధికారులు, ప్రజాతినిధులు తమకు కావాల్సిన వారికి ఇళ్లు వచ్చే విధంగా చేసుకున్నారా..? అందుకోసం వారి నుంచి భారీగా వసూళ్లు చేసుకున్నారా..? కొంత మంది డబ్బుల కోసం లబ్ధిదారుల నుంచి ఖాళీ ప్రామిసరీ నోట్ల మీద సంతకాలు కూడా చేయించుకున్నారా..? అంటే అవుననే సమాధానం వస్తోంది. కోదాడలో బుధవారం ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుండగా అధికార పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులైన మహిళతో జరిపిన ఫోన్ సంభాషణ పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. తానే డ్రాలో ప్రత్యేకంగా ఇల్లు వచ్చే విధంగా స్పెషల్‌గా తీయించానని, దానికి డబ్బులు ఇవ్వాలని ఫోన్‌లో డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే లిస్టులో పేరు ఉండదని సదరు మహిళను ఆ కౌన్సిలర్ బెదిరించడంతో పాటు.. డబ్బులు ఇవ్వకపోతే గతంలో ఖాళీ ప్రామిసరీ నోట్ మీద సంతకం చేసి ఇచ్చారని, దానిపై అప్పురాసుకుంటానని చెప్పడం గమనించదగ్గ విషయం. ఈ ఫోన్ సంభాషణ పట్టణంలోని పలుగ్రూపుల్లో వైరల్ కావడంతో అధికారపార్టీ నేతలు సమాధానం చెప్పుకోలేక సతమతమవుతున్నారు.

## క్లుప్తంగా

### తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

**మోటకొండూర్:** తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన మోటకొండూర్ మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొడిగె సత్తయ్య మంగళవారం సాయంత్రం కల్లు గీసేందుకు గ్రామ సమీపంలోని తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం ఆయనను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సత్తయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కేజీకేఎస్ రాష్ట్ర నాయకులు బొలగాని జయరాములుగౌడ్, బొడిగె భిక్షపతి, కొమ్మగాని ప్రభాకర్‌గౌడ్ కోరారు.

**రోడ్డు ప్రమాదంలో..**

**భూదాన్‌పోచంపల్లి:** పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు.. పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం గ్రామానికి చెందిన కొయ్యడ సతీష్ పనిమీద బైక్‌పై పోచంపల్లికి వస్తుండగా సబ్‌స్టేషన్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సతీష్ కిందపడటంతో ముఖం, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం డాక్టర్ సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం బీబీనగర్ ఎయిమ్స్‌ను పంపించారు.

### హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఇద్దరి రిమాండ్

**మఠంపల్లి:** మండల కేంద్రంలో ఈ నెల 6న స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన ఇద్దరు యువకులను మంగళవారం రిమాండ్‌కు తరలించారు. మఠంపల్లి ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లికి చెందిన ఎల్లబోయిన నాగరాజు, మామిడి నరేందర్ ఈ నెల 6వ తేదీన స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రోల్ దగ్గర మద్యం తాగి ప్రయాణికులపై దాడి చేస్తుండగా ఆపడానికి వెళ్లిన హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డారు. హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు వారిద్దరిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించడంతో మంగళవారం జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

### గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్య

**గుర్రంపోడు:** అప్పుల బాధతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. ఎస్ఐ బి. శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలంలోని జునూతుల గ్రామానికి చెందిన బొల్లం యాదయ్య, సత్తమ్మ(38) భార్యాభర్తలు. వీరు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. వ్యవసాయం చేసేందుకు అప్పులు చేయగా.. చేసిన అప్పులు తీర్చలేమనే మనోవేదనతో ఈ నెల 5వ తేదీన సత్తమ్మ తమ వ్యవసాయబావి వద్దకు వెళ్లి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. అప్పుల బాధతోనే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తండ్రి బొమ్ము పర్వతాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# పూట గడవని కుటుంబానికి ఆపద

- ఇంటి పెద్దను మంచానికే పరిమితం చేసిన క్యాన్సర్ మహమ్మారి
- అప్పు చేసి రూ.5లక్షలు ఖర్చు చేసినా నయంకాని వ్యాధి
- వైద్యానికే నెలకు రూ.10వేల వరకు ఖర్చు
- ఆదాయ వనరులు లేక అల్లాడుతున్న పేద కుటుంబం
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు

పేద కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చింది. క్యాన్సర్ మహమ్మారి పేదింటి పెద్దను కబళిస్తుండగా.. వైద్యానికి నెలకు రూ.వేలు ఖర్చుచేయలేక ఆ కుటుంబం అల్లాడుతోంది. ఆదాయ వనరులు లేక ఒక వైపు పూ టగడ్లని దైన్యం.. మరోవైపు మాయదారి వ్యాధి బా రిన పడిన ఇంటి పెద్ద రోజురోజుకూ క్షీణిస్తున్న ఆ రోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. దిక్కుతో చని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఆ పేద కుటుంబం సాయమందించాలని దాతలను వేడుకుంటోంది.

**మునుగోడు :** నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన జాజుల వెంకటయ్యకు భార్య పారిజాతతో పాటు కుమారుడు, కూతురు సంతానం. వీరికి గ్రామంలో పది గుంటల వ్యవసాయ భూమితో పాటు తలదాచుకునేందుకు చిన్నపాటి ఇల్లు ఉంది. వెంకటయ్య ఆటో నడుపుతుండగా పుట్టుమూగ అయిన పారిజాత కూలి పనులకు వెళ్తూ పిల్లలను చదించుకుంటూ ఉన్నంతలో హాయిగానే జీవనం సాగించేవారు.


నోటి క్యాన్సర్ బారిన పడిన వెంకటయ్య

కన్నీటి గాథ

**ఆరునెలలుగా నరకయాతన**

ఐదేళ్ల క్రితం వెకటయ్య తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడికి వైద్య పరీక్షలు చేయించగా నోటీ క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధారించారు. అప్పట్లోనే పలు ఆస్పత్రుల్లో వెంకటయ్య చికిత్స పొంది మందులు క్రమం తప్పకుండా వాడుతుండడంతో వ్యాధి తగ్గిపోయింది. మళ్లీ ఆరు మాసాల క్రితం వ్యాధి తిరగబెట్టడడంతో వెంకటయ్య మంచానికే పరిమితం అయ్యాడు. కేవలం ద్రవపదార్థాలు మాత్రమే తీసుకొని కాలం వెళ్లదీస్తూ నరకయాతన అనుభవిస్తున్నాడు.

**అప్పు చేసి రూ.5లక్షలు ఖర్చు చేసినా..**

ఇంటి పెద్ద దిక్కును కాపాడుకునేందుకు వెంకటయ్య కుటుంబ సభ్యులు పడరాని పాట్లు పడుతున్నారు. అందినకాడికి అప్పులు చేసి పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ. 5లక్షల వరకు ఖర్చు చేసి శస్త్ర చికిత్సలు చేయించినా నేటికీ అతని ఆరోగ్యం మెరుగుపడలేదు. వైద్యానికి నెలకు రూ.10వేలు ఖర్చు చేయాల్సి ఉండడంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఆదాయ వనరులు లేక.. ఎక్కడ అప్పులు అడుగుతారోనని తెలిసిన వారు ముఖం చాటేస్తుండడంతో ప్రస్తుతం ఆ కుటుంబం పూట గడవడమే కష్టంగా మారింది. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన కుమారుడు తండ్రిని ఆస్పత్రుల చుట్టూ తిప్పుతుండగా పారిజాత కూలి పనులకు వెళ్తూ వచ్చే అరకొర ఆదాయంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. మనసున్న మారాజులు ఆర్థిక సాయమందించి ఆదుకోవాలని ఆ కుటుంబం వేడుకుంటోంది.

**పూట గడవడమే కష్టంగా ఉంది**



నాన్నకు నోటి క్యాన్సర్ రావడంతో ఆయన ఆరోగ్యం మెరుగుపరిచేందుకు ఇప్పటి వరకు దాదాపు రూ.5 లక్షలకు పైగా ఖర్చుచేశాం. అయినా వ్యాధి నయం కావడం లేదు. పైగా వైద్యానికి ప్రతి నెలా రూ.10వేలు ఖర్చు అవుతోంది. ఆయన ఆటో నడిపితేనే మా కుటుంబం గడిచేది. నాన్న మంచానికే పరిమితం కావడంతో పూట గడవడం లేదు. దయగల మహారాజులు మా కుటుంబానికి సహాయం అందించి ఆదుకోవాలి.

– మణికుమార్, వెంకటయ్య కుమారుడు

# గంజాయి రవాణా ముఠా అరెస్ట్

- నిందితుల నుంచి 122 కిలోల గంజాయి స్వాధీనం

**కోదాడరూరల్:** ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ నుంచి ఢిల్లీకి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కోదాడలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు మంగళవారం విలేకరులకు వెల్లడించారు. అడిషనల్ ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇర్ఫాన్ అలీ, బల్వీందర్‌సింగ్ లారీ డ్రైవర్‌లు. ఇద్దరు పక్క పక్క గ్రామాలకు చెందిన వారు కావడంతో పాటు డ్రైవర్ వృతిలో ఉండటంతో స్నేహితులయ్యారు. వీరు డ్రైవింగ్ చేస్తున్న సమయంలో ఢిల్లీకి చెందిన బట్టల వ్యాపారి కరణ్‌వీర్ పరిచయమయ్యాడు. కరణ్‌వీర్ తన వ్యాపార పనుల నిమిత్తం హైదరాబాద్, విజయవాడ, వైజాగ్‌కు వచ్చినపుడు ఇర్ఫాన్ అలీ, బల్వీందర్‌సింగ్‌ను కూడా అప్పుడప్పుడు కారులో తీసుకొచ్చేవాడు. కరణ్‌వీర్‌కు వ్యాపారం చేస్తే వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో గంజాయి రవాణా చేయడం ప్రారంభించాడు. ఈ విషయం ఇర్ఫాన్ అలీ, బల్వీందర్‌సింగ్‌లకు చెప్పి వైజాగ్ వెళ్లి గంజాయి ఢిల్లీకి రవాణా చేస్తే రూ.10వేల చొప్పున ఇస్తానని తెలపడంతో వారు ఒప్పుకున్నారు. ఇద్దరికి రూ.9వేలను ముందుగా ముట్టజెప్పాడు. దీంతో వారు కరణ్‌వీర్ ఇచ్చిన కారులో ఈ నెల 3న గంజాయి కోసం వైజాగ్‌కు వెళ్లారు. ఆర్‌కే బీచ్ సమీపంలో రూంలో ఉండగా ఓ గుర్తుతెలియన వ్యక్తి వచ్చి కారు తీసుకెళ్లి అందులో ఏర్పాటు చేసిన ఐరన్ బాక్స్‌లో 76 గంజాయి ప్యాకెట్లు(122 కిలోలు) అమర్చాడు. ఆ గంజాయిని వీరిద్దరూ ఢిల్లీకి తీసుకెళ్లేందుకు అక్కడి నుంచి బయల్దేరారు.


వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు

**మార్గమధ్యలో పోలీసులను తప్పించుకుంటూ..**

మార్గమధ్యలో చాలాచోట్ల పోలీసులను తప్పించుకుంటూ వచ్చిన వీరిద్దరు రాష్ట్ర సరిహద్దు అయిన కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్‌లోని చెక్ పోస్ట్ వద్ద పోలీసులును చూసి పరారవుతుండగా పట్టుకున్నారు. పోలీసులు కారును తనిఖీ చేయగా గంజాయి లభించింది. ఆ గంజాయిని తహసీల్దార్ సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.20లక్షలు ఉంటుందని అడిషనల్ ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి గంజాయితో పాటు కారు, మూడు సెల్‌ఫోన్‌లు, ఓ జీపీఎస్ మెషీన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులిద్దరిని రిమాండ్‌కు తరలించగా కరణ్‌వీర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ ప్రకాష్, కోదాడ రూరల్ సీఐ, ఎస్ఐలు రామకృష్ణారెడ్డి, సాయిప్రశాంత్, ఏఎస్ఐ ఆనంద్‌నాయక్, హమీద్, సిబ్బంది జాన్, రవి, నరహరి, రాంబాబు ఉన్నారు.

### విద్యార్థిని ఢీకొట్టిన బైక్

**మోత్కూరు:** కళాశాల విద్యార్థిని బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం వెల్దేవి గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ మోత్కూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం అతడు కాలేజి ముందు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో అతడి చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానికులు అతడిని 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### బాల్య వివాహం అడ్డగింత

**యాదగిరిగుట్ట:** మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లిలో బాల్య వివాహాన్ని పోలీసులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, చైల్డ్ లైన్ టీం సభ్యులు అడ్డుకున్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిపల్లిలో మంగళవారం సుమారు 16 సంవత్సరాల బాలికకు అదే గ్రామానికి చెందిన సుమారు 21 సంత్సరాల అబ్బాయితో బాల్య వివాహం చేస్తున్నట్లు చైల్డ్ లైన్ నంబర్ 1098కు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులతో పాటు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, 1098 టీం సభ్యులు యాదగిరిపల్లికి చేరుకొని బాల్య వివాహం జరగకుండా అడ్డుకున్నారు. బాల్య వివాహాలతో జరిగే నష్టాన్ని ఇరు కుటుంబాల సభ్యులకు వివరిస్తూ కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లా బాలల సంక్షేమ సమితి ఆదేశాల మేరకు బాలిక రక్షణ, సంరక్షణ నిమిత్తం ఆమెను సఖి సెంటర్‌లో చేర్పించారు.

### రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

**భువనగిరి:** రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన భువనగిరి పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఆకుల శేఖర్(34) భువనగిరి రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఎదురుగా వస్తున్న గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. ఈ నెల 1వ తేదీన అతడు ఇంటి నుంచి బయల్దేరి వెళ్లినట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఇన్‌చార్జి హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**భువనగిరి:** భూ వివాదానికి సంబంధించి బంధువుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలంలోని హన్మాపురం గ్రామానికి చెందిన పన్నాల సత్తిరెడ్డి(75) ఈ నెల 6వ తేదీన గ్రామంలో గల తన భూమిని పరిశీలించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. కాగా ఆ భూమికి సంబంధించి కేసు కోర్టులో ఉందని.. అయినప్పటికీ భూమిని చేసేందుక ఎందుకు వచ్చారని సత్తిరెడ్డిని అతడి బంధువులు చెంపపై కొట్టి తోసేశారు. దీంతో సత్తిరెడ్డికి గాయం కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం భువనగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

**సూర్యాపేటలో మేస్త్రి..**

**సూర్యాపేట క్రైం:** ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మేస్త్రి మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శ్రీకాంత్ సూర్యాపేట పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు గల శ్రీరాంనగర్ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో మేస్త్రిగా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం అదే అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్ పనిచేస్తున్న సంతోష్‌తో అతడికి గొడవ జరిగింది. ఈ క్రమంలో వాచ్‌మెన్ దంపతులు శ్రీకాంత్‌పై దాడి చేశాడు. దీంతో తీవ్రగాయాలపాలైన శ్రీకాంత్‌ను సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులు బాగానే ఉన్న శ్రీకాంత్ మంగళవారం అకస్మాత్తుగా ఆస్పత్రిలోనే మృతిచెందాడు. కాగా వాచ్‌మెన్ దాడి చేయడంతోనే శ్రీకాంత్ మృతిచెందాడని అతడి తరపు బంధవులు ఆరోపిస్తుండగా.. గుండెపోటుతోనే మృతిచెందాడని స్థానికులు చెబుతున్నారు. కాగా ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


శ్రీకాంత్ మృతదేహం

# తడి, పొడి విధానంతో అధిక దిగుబడులు

**అర్వపల్లి:** వరిలో తడి, పొడి విధానంతో నీటి వాడకం తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని జర్మనీకి చెందిన కోర్ కార్బన్‌ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ జాన్ ఆంబ్లర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జామీ కీచ్, ఎంపీపీ మన్నె రేణుక అన్నారు. జాజిరెడ్డిగూడెం మండలం అడివెంలలో మంగళవారం కోర్ కార్బన్‌ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, స్వామి వివేకానంద రూరల్ డెవలప్‌మేంట్ సొసైటీ ఆధ్వర్యంలో వరిలో తడి, పొడి విధానంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల వలన భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగడం వలన వ్యవసాయంలో నీటి సమర్థ యాజమాన్య పద్ధతులను పాటించడం ఎంతో అవసరమన్నారు. అలాగే వరి పొలంలో మిథేన్ విషవాయువు విడుదల కాకుండా నివారించవచ్చని చెప్పారు. తడి, పొడి పద్ధతిలో వరి సాగు చేయడం వలన వరి పంట వేరు వ్యవస్థ బలంగా అభివృద్ధి చెంది ఈదురుగాలులకు కూడా పడిపోకుండా ఉంటుందని, దిగుబడి కూడా అధికంగా వస్తుందని చెప్పారు. ఈ విధానంతో నీటి వినియోగం 17 నుంచి 30 శాతం వరకు తగ్గుతుందని అన్నారు. రైతులకు సంస్థ కోఆర్డినేటర్లు ఈ విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. స్వామి వివేకానంద గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఎండీ గౌస్‌మియా అధ్యక్షతన జరిగిన సదస్సులో సీసీఎక్స్ మేనేజింగ్ డైరెక్టర్ నిరోజ్ మహంతి, ఏఓ శశిధర్‌రెడ్డి, స్వామి వివేకానంద సంస్థ జిల్లా మేనేజర్ జిసాన్ అలీ, సీసీఎక్స్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, కన్సల్టెన్సీ అశోక్ రాజేష్, సంస్థ సూపర్‌వైజర్ బాణోత్ యాకూబ్‌నాయక్, సర్పంచ్ పద్మవెంకటయ్య, మత్స్య సంఘం చైర్మన్ పిట్టల జానయ్య, వివిధ మండలాల కోఆర్డినేటర్లు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోర్ కార్బన్‌ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ జాన్ ఆంబ్లర్

# గడ్డిపల్లిలో పెసర పంట పరిశీలన

**గరిడేపల్లి:** మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో మంగళవారం రైతులు సాగుచేసిన పెసర పంటను విద్యార్థులతో కలిసి సందర్శించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి. లవకుమార్ తెలిపారు. అనంతరం పెసర పంట వేసుకోవడం వలన కలిగే లాభాల గురించి వివరించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డి. ఆదర్శ్ మాట్లాడుతూ.. పెసరలో పెనుబంక, పల్లాకు తెగులు, శనగ పచ్చపురుగు గమనించినట్లు తెలిపారు. వీటి నివారణకు అసిఫెట్ 1.5 గ్రాములు లేదా అసిటామిప్రైడ్ 0.2 గ్రాములు లేదా నోవల్యూరిన్ 1మి.లీ., 5 మి.లీ. వేప నూనెతో లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త కిరణ్ పెసరలో ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు బచ్చు సైదయ్య, జగన్నాథ యూనివర్సిటీ వ్యవసాయ డిగ్రీ విద్యార్థులు పవన్, నితిన్, నాగేంద్ర, తరుణ్ తదితరులున్నారు.


పెసర పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

# దళిత బంధు అడ్డుకున్నారని ఆత్మహత్య

- కౌన్సిలర్ కారణమని సూసైడ్ నోట్

**మోత్కూరు :** తనకు దళిత బంధు పథకం రాకుండా అధికార పార్టీ కౌన్సిలర్ అడ్డుకున్నాడని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు కౌన్సిలరే కారణమని సూసైడ్ నోట్‌లో రాశాడు. మోత్కూరు పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన కూరెళ్ల రమేష్(46)కు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య యాదమ్మ, కుమారుడు సామేల్, కూతురు సౌజన్య ఉన్నారు. మూడు సంవత్సరాల క్రితం పెద్ద కుమారుడు వినయ్ అనారోగ్యంతో మృతిచెందాడు. కుమార్తె సౌజన్య వివాహం అయింది. చిన్న కుమారుడు సామేల్ పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. భార్య యాదమ్మ కూలి పనులు చేస్తూ కుటుంబం గడుపుతున్నారు. ఇటీవల దళిత బంధు పథకానికి వీరి కాలనీ నుంచి 20 మందితో జాబితాను కౌన్సిలర్ కూరెళ్ల కుమారస్వామి ఆధ్వర్యంలో రూపొందించారు. ఆ జాబితాలో తన పేరు లేదని తెలుసుకొని, దీనికి కౌన్సిలరే కారణమని రమేష్ భావించాడు. దళిత బంధు పథకం లబ్ధిదారుల జాబితా తయారీ కోసం కాలనీలో రెండు వర్గాలు విడిపోయాయని, తన కంటే మెరుగ్గా ఉన్న వారికి పథకంలో ఎంపిక చేశారని రమేష్ కొన్ని రోజులుగా మనోవేదనకు గురవుతున్నట్లు స్థానికులు తెలిపారు. కాలనీకి చెందిన ఓ వ్యక్తి మంగళవారం మృతి చెందడంతో అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు వెళ్లగా.. రమేష్ ఇంట్లోనే ఉన్నాడు. ఈ క్రమంలో రమేష్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుమారుడు సామేల్ వచ్చి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. చుట్టుపక్కల వారు వచ్చి కిందికి దింపారు. మృత దేహాన్ని ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి పరిశీలించి పంచనామా నిర్వహించి భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తన చావుకు కౌన్సిలరే కారణమని అని రమేష్ తన సూసైడ్ నోట్‌లో రాశాడు.


రమేష్ (ఫైల్)

**నాకు సంబంధం లేదు..**

కూరెళ్ల రమేష్ ఆత్మహత్యకు తాను కారణమనే మాట అవాస్తవమని కౌన్సిలర్ కూరెళ్ల కుమారస్వామి తెలిపారు. దళిత బంధు జాబితా తయారీ ఎంపికలో తనకు సంబంధం లేదని కౌన్సిలర్ చెప్పారు.

# పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అప్పగింత

**బొమ్మలరామారం:** సికింద్రాబాద్‌కు చెందిన జెల్ల వెంకటేష్ జులై 1వ తేదీన బొమ్మలరామారం మండలంలోని హాజీపూర్ గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్ ఆచూకీ కనుగొని మంగళవారం బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

**రాజాపేటలో..**

**రాజాపేట:** మండలంలోని రేణికుంట గ్రామ పరిధిలో నిర్మాణం జరుగుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో పనిచేస్తున్న కూలీల సెల్‌ఫోన్లను సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లగా ఒక్క రోజులోనే వాటిని కనిపెట్టి బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పనిచేస్తున్న వినోద్, సంపత్ సోమవారం రాత్రి తమ సెల్‌ఫోన్లకు చార్జింగ్ పెట్టి నిద్రించగా గుర్తుతెలియని వ్యక్తి వాటిని దొంగిలించాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఈఆర్ఐ యాప్ ద్వారా సెల్‌ఫోన్లను కనిపెట్టి బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

**చౌటుప్పల్‌లో..**

**చౌటుప్పల్:** మండలంలోని దండుమల్కాపురం గ్రామంలో పనికి వెళ్లి వస్తుండగా జులై 13న గోగుల కృష్ణ అనే వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి మంగళవారం బాధితుడికి అప్పగించినట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

# పంచాయతీ కార్మికులకు గాయాలు

**వలిగొండ:** బైక్ అదుపుతప్పి పంచాయతీ కార్మికులకు తీవ్రగాయాలైన ఘటన వలిగొండ మండలంలోని అరూర్-నరసాయగూడెం గ్రామాల మధ్య మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. వలిగొండ మండలంలోని వెంకటాపురానికి చెందిన పంచాయతీ కార్మికులు మంద రాములు, గుడ్డేటి మల్లేశం, వలమాల భిక్షం వలిగొండలో సమ్మెలో పాల్గొని తిరిగి గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అరూర్-నరసాయగూడెం గ్రామాల మధ్య వారి బైక్ అదుపుతప్పడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం వలిగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



# ఉజ్వల భవిష్యత్తుకు 'నవోదయం'

- జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- ఉమ్మడి జిల్లాకు సంబంధించి చలకుర్తి జేఎన్‌వీలో 80 సీట్లు
- 2024 జనవరి 20న ప్రవేశ పరీక్ష

**పెద్దవూర:** గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంలో జవహర్ నవోదయ విద్యాలయాలు(జేఎన్‌వీ) కీలకపాత్ర పోషిస్తున్నాయి. జేఎన్‌వీలో 2024–2025 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల అయ్యింది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో 1986 జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు 1986లో నల్లగొండ జిల్లాకు సంబంధించి అప్పటి శాసనసభ నియోజకవర్గమైన చలకుర్తి గ్రామంలో 45 ఎకరాల విస్తీర్ణంలో జేఎన్‌వీని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష ద్వారా 6వ తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. 6 నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య, బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ వసతి సౌకర్యం కల్పిస్తారు. 6 నుంచి 8వ తరగతి వరకు ప్రాంతీయ భాష లేదా మాతృ భాషలో విద్యాబోధన జరుగుతుంది. ఆ తరువాత తరగతులలో గణితం, సైన్స్ సబ్జెక్టులు ఆంగ్ల భాషలోనూ, సామాజిక శాస్త్రములు హిందీ భాషలోనూ బోధిస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతిలో 80 మంది విద్యార్థులు, 11, 12 తరగతులలో 40 మంది చొప్పున విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు.


నాగార్జునసాగర్‌లోని చలకుర్తి జేఎన్‌వీ

**దరఖాస్తు చేసుకునే విధానం..**

2024–25 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారంపై ప్రస్తుతం విద్యార్థి చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకం చేయించిన తర్వాతే వెబ్‌సైట్ నందు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 5వ తరగతి ఏ పాఠశాలలో చదువుతున్నారో అక్కడి నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తు ఫారంపై విద్యార్థి, తండ్రి సంతకాలు తప్పకుండా ఉండాలి. ఫొటో కూడా అప్‌లోడ్ చేయాలి. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జేఎన్‌వీనల్గొండ.ఇన్ ద్వారా లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకోవటానికి ఈ నెల 10వ తేదీ ఆఖరు.

**ఎవరు అర్హులు..?**

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతూ 01.05.2012 నుంచి 31.07.2014 మధ్య జన్మించిన వారు అర్హులు. ప్రవేశ పరీక్ష 2024 జనవరి 20వ తేదీన ఉదయం 11.30 నుంచి 1.30 వరకు రెండు గంటల పాటు నిర్వహిస్తారు.

**రిజర్వేషన్ విధానం**

6వ తరగతిలో మొత్తం 80 సీట్లు ఉండగా అందులో 75 శాతం సీట్లు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయించారు. గ్రామీణ ప్రాంత రిజర్వేషన్ వర్తించాలంటే 3, 4, 5 తరగతులు గ్రామీణ ప్రాంతాలలో చదివి ఉండాలి. ఏ ఒక్క రోజు పట్టణ ప్రాంతాలలోనూ, మున్సిపాలిటీలలో చదివినా గ్రామీణ ప్రాంత రిజర్వేషన్ వర్తించదు. ఎట్టి పరిస్థితులలోనూ ఒకసారి పరీక్షకు హాజరైన విద్యార్థి రెండోసారి హాజరయ్యేందుకు వీల్లేదు. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7.5శాతం, బాలికలకు మొత్తం సీట్లలో 1/3వ వంతు రిజర్వేషన్ ఉంటుంది. అభ్యర్థి ఐదో తరగతిలో ఏ మాధ్యమంలో విద్యాభ్యాసం చేస్తారో.. ఆ భాషలోనే పరీక్ష ఉంటుంది. అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న ఫారం, ప్రవేశ పత్రంలో పేర్కొన్న భాషలోనే టెస్టు బుక్‌లెట్ ఇస్తారు. దరఖాస్తు ఫారంలోనూ, ప్రవేశ పత్రంలో పరీక్షా మాధ్యమం ఒకేలా ఉండేలా చూసుకోవాలి. ప్రవేశ పరీక్ష మూడు విభాగాలలో కలిపి 80 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ రూపంలో ఉంటాయి. రీజనింగ్ 40 ప్రశ్నలు, గణితంపై 20 ప్రశ్నలు, భాషా పరిజ్ఞానంపై 20 ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రంలో పూరించాలి.

**కష్టపడితే సీటు ఖాయం**



విద్యార్థులు కొంచెం కష్టపడితే జేఎన్‌వీలో సీటు సాధించవచ్చు. ప్రవేశ పరీక్ష ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పారదర్శకంగా నిర్వహిస్తాం. ప్రశ్నపత్రం తయారీ నుంచి విద్యార్థుల ఎంపిక వరకు సీబీఎస్ఈ వారే నిర్వహిస్తారు. నవోదయ సీట్లు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మవద్దు. అలాంటి వారిపై పోలీసులతో కలిసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– ఆర్. నాగభూషణం, చలకుర్తి జేఎన్‌వీ ప్రిన్సిపాల్